క్లుప్తంగా

కాటాలకు ముద్రలు లేకపోతే కఠిన చర్యలు



మండిబజార్‌లో బియ్యం సంచి తూకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): వ్యాపార దుకాణాల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలకు, తూనిక రాళ్లకు ప్రభుత్వ ముద్రలు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు పాతబస్టాండ్ మండిబజార్‌లోని కూల్‌డ్రింక్, కిరాణ, హార్డ్‌వేర్ షాపులు, బేకరీలు, రాజ్ థియేటర్ వద్ద దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. 6 కేసులు నమోదు చేసి రూ.18వేలు అపరాధ రుసుం విధించామన్నారు. వ్యాపారులు ఎవరైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మినా, తూనికపు యంత్రాలు, తూనిక రాళ్లకు ముద్రలు లేకుండా వాడినా ఫిర్యాదు చేయాలని వినియోగదారులను కోరారు.

నందికొట్కూరు రోడ్డును విస్తరించాలి



నందికొట్కూరు రోడ్డును పరిశీలిస్తున్న పీపీఎస్ఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : నంద్యాల చెక్‌పోస్టు నుంచి వెళ్లే నందికొట్కూరు రోడ్డును విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ పౌరసేవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇ. పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పీపీఎస్ఎస్ నాయకులు నందికొట్కూరు రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు. మునిసిపల్ కార్పొరేషన్‌కు ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలల ప్రారంభం, వదిలే సమయాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాకోబు, నరసయ్య, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖనిజ అక్రమ రవాణా ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

కర్నూలు (న్యూటౌన్): డోన్ మండలం చిగురుమానుమిట్ట దగ్గర స్టేటెడ్ ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రాజశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. పట్టుబడిన మూడు ట్రాక్టర్లలో ఒక్కోదానికి రూ.12వేలు చొప్పున మొత్తం రూ.36వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. తనిఖీలో జిల్లా విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, తదితర ప్రాంతాల నుంచి మొత్తం 37 మంది భక్తులు పరోక్షసేవగా కుంకుమార్చనను జరిపించుకున్నారు. ముందుగా పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్ష కుంకుమార్చన జరిపించారు.

కో కన్వీనర్‌గా శ్రీనివాసులు

కర్నూలు (న్యూటౌన్): బీజేపీ నంద్యాల పార్లమెంట్‌కు చెందిన మండ్ల శ్రీనివాసులును బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర మేధావుల విభాగ కో కన్వీనర్‌గా నియమించినట్లు ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. శుక్రవారం ఆమె చేతులమీదుగా శ్రీనివాసులుకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నాగరాజు, నంద్యాల జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు దేవేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలచౌర్యం కట్టడికి చర్యలు

- కెనాల్‌పై 24 గంటల నిఘా ఏర్పాటు
- పర్యవేక్షణకు డీఈఈలు, ఏఈలు నియమించిన నగరపాలక అధికారులు
- రూ.15 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- తాగునీటి సమస్య తలెత్తకుండా చూడటమే లక్ష్యంగా చర్యలు



నగర శివారులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

కర్నూలు (టౌన్): వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. జల చౌర్యం జరగకుండా చూసేందుకు ప్రత్యేకంగా డీఈఈలు, ఏఈలు నియమించింది. నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏటా సుంకేసుల రిజర్వాయర్ నుంచి ఓపెన్ చానల్ ద్వారా మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే, కెనాల్ ఇరువైపుల ఉన్న రైతులు మోటార్లు వేసి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో డ్యాం నుంచి విడుదల చేసిన నీరు పూర్తిస్థాయిలో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు చేరని పరిస్థితి. జలచౌర్యం కట్టడికి అధికారులు మోటార్లు, పైపులు తీసుకెళ్లడం, విద్యుత్ సరఫరా నిలిపివేయడం వంటి చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో ఈసారి నగరపాలక అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. సుంకేసుల నుంచి ఎస్ఎస్ ట్యాంకు వరకు కెనాల్ వెంబడి వారంలో 24 గంటల పాటు పర్యవేక్షణ చేసేందుకు ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, నలుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల ఎమినిటీస్ సిబ్బందిని ఏడుగురి చొప్పున నియమించారు. వీరంతా ఈ వేసవి కాలంలో సుంకేసుల నుంచి మునగాలపాడుకు వచ్చే నీటిని చౌర్యం కాకుండా పోలీసుల సహకారంతో పర్యవేక్షణ చేస్తారు. ఇప్పటికే వారికి నగరపాలక అధికారులు ప్రత్యేక విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేశారు.

నీటి నిల్వకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం

శివారు కాలనీలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు (ఈఎల్ఎస్ఆర్)ల నిర్మాణంపై నగరపాలకయంత్రాగం దృష్టి సారించింది. ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా నగరంలో ఈఎల్ఎస్ఆర్‌లు లేవు. దీంతో నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేక శివారు కాలనీలకు నీటిని సరఫరా చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో ఈఎల్ఎస్ఆర్‌లు నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు.

రూ. 15 కోట్లు పరిపాలన అనుమతులు జారీ

ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణానికి రూ.15 కోట్లతో రూపొందించిన అంచనాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈమేరకు జనరల్ ఫండు నిధులు వినియోగించుకునేందుకు ప్రజారోగ్య సాంకేతిక శాఖ చీఫ్ ఇంజినీర్ ఆనందరావు రెండు రోజుల క్రితం పరిపాలన అనుమతులు సైతం జారీ చేశారు. ఈ నిధులతో నగరంలోని అశోక్‌నగర్‌లోని హెడ్ వాటర్ వర్క్స్‌లో రూ.2.19 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులకు అవసరమైన స్లూయిస్ వాల్వ్, పైపుల ఏర్పాటుతో పాటు నగరంలోని జమ్మిచెట్టు వద్ద 500 కేఎస్ ఓవర్ హెడ్ ట్యాంకు, బాలాజీనగర్‌లో 750 కేఎల్ ట్యాంకు, చాణిక్యపురికాలనీలో 1000 కేఎల్ ట్యాంక్, నగరపాలక కార్యాలయం ప్రాంగణంలో 1000 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మించనున్నారు. ఇందుకోసం మొత్తం రూ. 9. 52 కోట్లు వెచ్చించనున్నారు. సీనరేజ్ చార్జస్, జీఎస్టీ తదితర చార్జీలు కలిపి మొత్తం రూ.15 కోట్లు అవుతుంది. నిర్మాణ పనులను త్వరలోనే టెండర్ల ప్రక్రియ ద్వారా కేటాయించేందుకు నగరపాలక యంత్రాంగం చర్యలు చేట్టింది.

పల్లెల సమగ్రాభివృద్ధే ధ్యేయం



భూమి పూజ కార్యక్రమంలో కోడుమూరు సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నాయకులు

- కోడుమూరు సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి
- రూ.11.85 కోట్లతో పూడూరు రోడ్డు పనులకు శంకుస్థాపన

కర్నూలు సిటీ: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పడిదెంపాడు, పూడూరు మీదుగా కోళ్లబాపురం వరకు రూ.11.85 కోట్లతో బీటీ రోడ్డు వేసేందుకు భూమి పూజ చేశారు. పడిదెంపాడు గ్రామ నాయకుడు చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం నేటికీ వెంటాడుతోందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం రోడ్లు, వాటి మరమ్మతుల గురించి పట్టించుకోలేదన్నారు. రోడ్ల నిర్మాణాలకు కేటాయించిన నిధులను ఇతర వాటికి మళ్లించిందన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారన్నారు. ఒక వైపు సంక్షేమం..మరో వైపు అభివృద్ధి పనులు చేపడుతుండటంతో ఎక్కడ తమను జనాలు మర్చిపోతారోనని ప్రతిపక్ష పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం మొదలుపెట్టారన్నారు. నియోజకవర్గంలో పలు రోడ్లను బాగు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నెహిమియా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, శ్రీ ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్లు వినయ్‌కుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శేషిరెడ్డి, మండల కన్వీనర్ మహబూబ్ బాష, గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, ఎంపీటీసీలు కృష్ణ, హనుమంతు, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, సాగర్, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, బి.తాండ్రపాడు మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, పూడూరు మహేష్, కృష్ణ, ప్రసాద్, ఆంజనేయగౌడ్, వెంకటేశ్వర్లు, ఆదాము, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



లక్ష్మీపురంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్) : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తోందని కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 28వ వార్డు లక్ష్మీపురంలో సుంకులమ్మ జాతర సందర్భంగా బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని హాజరై బండలాగుడు పోటీలను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోనే రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. విత్తనం పంపిణీ నుంచి దిగుబడి కొనుగోలు వరకు ప్రభుత్వం రైతన్నలకు అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణ రెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, శ్వేతా రెడ్డి, కల్లూరు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ రోజు

లలితా జయంతి

కర్నూలు కల్చరల్: మాఘపౌర్ణమి శ్రీ లలితా అమ్మవారి జయంతిని పురస్కరించుకొని శనివారం ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి నవగ్రహ పూజ, నవగ్రహ హోమం, లక్ష్మీ గణపతి, మృత్యుంజయ, శ్రీ లలితా దేవి హోమాలు, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కర్నూలు కల్చరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని సంకల్ బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, భవానీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర శర్మ తెలిపారు. సాయంత్రం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుగుతాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

వలంటీర్లకు వందనం

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు అర్బన్ పరిధిలోని 16వార్డుల వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారంమధ్యాహ్నం నిర్వహించనున్నారు. 34వ వార్డు పరిధిలోని నిర్మల్‌నగర్ పార్కులో జరిగే ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు.

రైతులపై కాల్పులు అన్యాయం



కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : ఢిల్లీలో మద్దతు ధర చట్టం కోసం పోరాడుతున్న రైతులపై కాల్పులు జరిపి చంపడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా కాల్పుల్లో చనిపోయిన రైతు సుఖ్‌కరణ్‌సింగ్‌కు సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలు పట్టడంలేదన్నారు. వేసవిలో నీటి కొరత లేకుండా చూడాలన్నారు. కర్నూలులో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు పీఎస్ రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, నారాయణ, ఎండీ ఆనందుబాబు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు హేయమైన చర్య

కర్నూలు(సెంట్రల్) : తాము పండించిన పంటలకు మద్దతు ధర కోసం చట్టం చేయాలని ఆందోళన చేపట్టిన రైతులపై పోలీసులు కాల్పులు జరిపి చంపేయడం హేయమైన చర్య అని సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలు ప్రకటించాయి. ఢిల్లీలో రైతు సుఖ్‌కరణ్‌సింగ్‌ను పోలీసులు కాల్చిచంపడాన్ని నిరసిస్తూ శుక్రవారం కార్మిక సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుటే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించిన ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతుల పండించిన పంటలకు మద్దతు ధర కోసం చట్టం చేయాలని ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న అన్నదాతలపై కాల్పులు జరపడం అన్యాయమన్నారు. ఈ కాల్పుల్లో చనిపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర పంపన్నగౌడ్, కృష్ణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు శుభ్‌కరణ్ సింగ్

కర్నూలు (సెంట్రల్) : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో ప్రాణాలు కోల్పోయిన శుభ్‌కరణ్ సింగ్ పోరాట యోధుడని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట శుభ్‌కరణ్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆనంద్ బాబు, వెంకటేశ్వర్లు, పీఎస్ రాధాకృష్ణ, గౌస్ దేశాయ్, కేవీ నారాయణ, రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపు కంచి కామకోటి పీఠాధిపతి రాక

మహానంది: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి ఈనెల 25న మహానంది రానున్నట్లు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. శుక్రవారం వారు ఆలయంలో పీఠాధిపతి పర్యటన, పూజలకు అవసరమైన ఏర్పాట్ల పనులను పర్యవేక్షించి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25, 26వ తేదీలలో మహానందిలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

మామపై అల్లుడి దాడి

మహానంది: కుమార్తెను పుట్టినింటికి పంపాలని అడిగిన మామపై అల్లుడు, కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన గాజులపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. గాజులపల్లె గ్రామానికి చెందిన హుసేన్ కుమార్తె వైశాలిని అదే గ్రామానికి చెందిన నాగమద్దిలేటికి ఇచ్చి వివాహం చేశారు. వైశాలి ప్రస్తుతం ఐదో నెల గర్భిణి. సంప్రదాయం ప్రకారం ఆమెను పుట్టినింటికి తీసుకెళ్లేందుకు తండ్రి అల్లుడి ఇంటికి వచ్చి అదే విషయాన్ని ప్రస్తావించాడు. కాగా అంతకుముందే ఉన్న మనస్పర్థల కారణంగా మామపై అల్లుడు నాగమద్దిలేటి, కుటుంబ సభ్యులు మౌలాలమ్మ తదితరులు దాడికి పాల్పడ్డారు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

28న టైలర్స్ డేను విజయవంతం చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న టైలర్స్ అసోసియేషన్ నేతలు

కర్నూలు (అర్బన్) : ఈనెల 28వ తేదీన స్థానిక పెద్దమార్కెట్ సమీపంలోని ఉర్దూఘర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న టైలర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్ బాషా టైలర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉర్దూఘర్ ప్రాంగణంలో టైలర్స్ డే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్టు డైరెక్టర్ రామారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు అబ్దుల్ జబ్బార్ ఫారుక్ తదితరులు హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని టైలర్ షాప్ ఓనర్లు, వర్కర్లు, మహిళా టైలర్లు స్వచ్ఛందంగా షాపులను బంద్ చేసి కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. పోస్టర్ల ఆవిష్కరణలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు నేషనల్ టైలర్ బాషా, బెనర్జీ, బి.రామకృష్ణ, ఎండీ ఖాశీం, సైఫుల్లా, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు



ఎక్స్‌ఎల్ఆర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి

కర్నూలు సిటీ: విద్యార్థులు కోర్సుతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు సులువుగా లభిస్తాయని ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులను ప్రస్తుతం అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా సిద్ధం చేయాలని చెప్పారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ కన్సార్టియం ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో పాటు, సైంట్ కంపెనీ వ్యవస్థాపకులు పద్మశ్రీ డా.బి.వి.ఆర్ మోహన్ రెడ్డి, సీసీసీ డిజిటల్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకులు శ్రీనాగవీర్, రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య సుధీర్‌కుమార్ అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.బి. శ్రీనివాస రెడ్డి, చైర్మన్ పి.సుబ్బారెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.బి. వీరభద్రారెడ్డి, వివిధ కాలేజీలకు చెందిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గిరిజనులపై పోలీసుల దాడి అమానుషం




ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కర్నూలు (సిటీ): ఇటీవల కలెక్టరేట్ దగ్గర నిరసన తెలుపుతున్న గిరిజనులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని వివిధ గిరిజన సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. గిరిజన మహిళకు న్యాయం చేయాలంటూ నిరసన తెలిపిన వారిపై విచక్షణా రహితంగా దాడి చేసిన త్రీటౌన్ సీఐ, ఎస్ఐతో పాటు వీడియోలో ఉన్న కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. లేకపోతే దాడి విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం డీఎస్పీ విజయశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి కైలాస్ నాయక్, బీజేపీ మోర్చా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామచంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

26న అనంతపురంలో రాష్ట్ర పునర్నిర్మాణ సభ

కర్నూలు(సెంట్రల్) : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన అనంతపురంలో రాష్ట్ర పునర్నిర్మాణసభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు దాదాగాంధీ తెలిపారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ సెల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..పునర్నిర్మాణ సభకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు తరలి రావాలన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు పాల్గొన్నారు.

శాంతిస్థాపనకు కృషి చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు సిటీ: పాలస్తీనా-ఇజ్రాయిల్ దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు ప్రపంచదేశాలు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. పాలస్తీనా-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఎడతెగని పోరాటం- వాటికి పరిష్కారం అనే అంశంపై కేవీఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్, ఎస్కే యూనివర్సిటీ ఆచార్య మురళీధర్ మాట్లాడారు. కొన్ని దేశాల ఆధిపత్యం వల్ల మిగిలిన దేశాలకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అన్ని దేశాలు పరస్పర సహకారంతో ముందుకు పోతే ఎలాంటి సమస్యలు తలెత్తవని అన్నారు. సదస్సులో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్. కుమార్, డా.ఎం సాహిత్య, డా.నజీరుద్దీన్, డా.జఫరుల్లా, డా.ఖాజామొద్దీన్, డా.జ్యోతిర్మయి, డా.పార్వతీదేవి, డా.ప్రతిమరాయ్, డా.సునీతరోస్, డా.జవహర్, డా.దేవికారాణి, డా.వేదావతి, డా.జె సుశీల, వరలక్ష్మి, విష్ణువందనా, విజయలక్ష్మి, డా.జి. మహబూబ్ బాష, డా.నజాయతుల్లా, మణికంఠ పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు (టౌన్) : వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక నగర పాలకలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సుంకేసుల రిజర్వాయర్ నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వరకు చేపడుతున్న మంచి నీటి పైపులైన్ పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతి, నాయకులు మురళీ, రామాంజనేయులు పాల్గొన్నారు.